క్లుప్తంగా

అయోధ్యకు జనగామ భక్తులు



జనగామ: అయోధ్య పుణ్యక్షేత్రంలో నేటి బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ వేడుకలకు జనగామ నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ప్రత్యేక రైళ్లు, విమానాలు, ట్రావెల్స్ ద్వారా అయోధ్యకు వెళ్లిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, శ్రీరామ నామ జపాలు చేస్తున్నారు. ప్రతిష్ఠ పూర్తయిన తర్వాత స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవనున్నారు.

నియామకం



లక్ష్మారెడ్డి

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన గంగిడి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కార్యదర్శిగా నియామకం అయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదివారం లక్ష్మారెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అవిశ్రాంతంగా కృషి చేస్తానన్నారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటుతామని పేర్కొన్నారు. తన నియమానికి సహకరించిన ఎంపీపీ మేకల వరలక్ష్మీనరేందర్, కాంగ్రెస్ నాయకులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, గంగిడి నరసింహారెడ్డి, కోళ్ల రవిగౌడ్, గాదె రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రచార కార్యదర్శిగా నియామకమైన లక్ష్మారెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

జాతర కమిటీ చైర్మన్‌గా సభావత్ రాజు



తరిగొప్పుల: మండలంలోని బొత్తగట్టునాగారం-బొత్తలపర్రె గ్రామాల సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహణ కమిటీ చైర్మన్‌గా సభావత్ రాజు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జాతర ప్రాంగణంలో ఐదు గ్రామాల సర్పంచ్‌లు ఇరుమల్ల బాలమణి, భూక్య కమలరవి, సబావత్ కాశీరాజు, భూక్య తిరుపతి, నంద్యానాయక్, ఎంపీటీసీ భూక్య జుంలాల్‌నాయక్ గ్రామ పెద్దల సమక్షంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నాం శ్రీనివాస్, డైరెక్టర్లుగా కుర్రె ప్రశాంత్, సుంకరి చిరంజీవి, ఇరుమల్ల మహేష్, జింక రాజు, యావగోని రాహుల్, ఎదునూరి రవీందర్, జాటోత్ రాజు, కర్ణకంటి సాంబరాజు, భూక్య సుమన్, లకావత్ రంగా, భూక్య గోవింద, దేవేందర్, రాజు, మాళి మోహన్, ముందావర్ వీరన్న ఎన్నికయ్యారు. సుధాకర్, బాలయ్య, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్న రాజ్‌కుమార్



చిల్పూరు: చిల్పూరు సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ ఆదివారం హైదరాబాదులో ఉత్తమ సర్పంచ్‌గా నేషనల్ అవార్డును అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతీ సంవత్సరం ఉత్తమ సర్పంచ్, ఉద్యమకారులు, సంఘసేవకులు, కవులు, రచయితలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారిని గుర్తించి అవార్డులను అందజేస్తారు. అందులో భాగంగా చిల్పూరు సర్పంచ్ రాజ్‌కుమార్‌ను ఉత్తమ సర్పంచ్‌గా ఎంపిక చేశారు. ఆదివారం బీఎస్‌ఏ జాతీయ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డును రాజ్‌కుమార్ అందుకున్నారు.

యాదవులు ఐక్యంగా ఉద్యమించాలి



జనగామ రూరల్: యాదవులు అన్ని రంగాల్లో అభివృద్ధిసాధించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. పట్టణంలోని అఖిల భారత యాదవ మహాసభ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కొమురవెల్లి దేవస్థాన చైర్మన్ పదవి యాదవులకే ఇవ్వాలని అన్నారు. యాదవులు ఎదగాలంటే ముందుగా రాజకీయంలో నిలదొక్కుకోవాలని అప్పుడే అవకాశాలు వస్తాయని తెలిపారు.

పరామర్శ

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బోడబండ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు భూక్య మల్లేష్ తండ్రి మృతి చెందాడు. ఆదివారం తండాలో సంగుడు నాయక్ మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు వేళాయె..

- జిల్లా వ్యాప్తంగా పండుగ శోభ
- అయోధ్య నుంచి ప్రత్యక్ష ప్రసారం కోసం స్క్రీన్ల ఏర్పాటు
- అన్ని ఆలయాల్లో సంప్రోక్షణ

జనగామ: సుగుణాభిరాముడు.. లోకోద్ధారకుడు.. అవతారపురుషుడు.. శ్రీరాముడు అయోధ్యకు పయనమైన వేళ.. జిల్లా వ్యాప్తంగా పండుగ శోభ సంతరించుకుంది. హిందువుల ఆరాధ్య పుణ్యస్థలం అయోధ్యలో నేడు (సోమవారం) బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. కాషాయపు జెండాలతో రెపరెపలాడుతున్నాయి. అయోధ్య రాముని ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ప్రతిఒక్కరు ప్రత్యక్ష ప్రసారంలో తిలకించేలా వాడవాడలా భారీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఐదు దశాబ్దాల సుదీర్ఘ కాలం తర్వాత.. తన రాజ్యంలోకి అడుగిడబోతున్న శ్రీరాముడిని తలచుకుంటూ.. ప్రజలు మరో దీపావళి పండగను జరుపుకునేందుకు ఇళ్లన్నీ శుద్ధి చేసుకుంటున్నారు.

అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన మహోత్సవం నేపథ్యంలో జిల్లా అంతటా రామ నామస్మరణలు మారుమోగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం అయోధ్య నుంచి వచ్చిన కలశాల్లోని అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయగా... వారం రోజులుగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శ్రీరాముడి రాకను స్వాగతిస్తూ హిందూ బంధువులు, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ శ్రేణులు, భక్తుల ఊరేగింపులు, భజనలు, సంకీర్తనలు, ఆట పాటలతో తమ భక్తిని చాటుతూ స్వాగతిస్తున్నారు. నేటి బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయాల్లో శుద్ధ జలాలతో సంప్రోక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నేడు ప్రత్యేక పూజలు

జనగామ పట్టణం బాణాపురం వేంకటేశ్వర స్వామి, రైల్వేస్టేషన్ ఏరియా చెన్నకేశ్వరస్వామి, పాతబీటు బజారు పందిరి, గీతాశ్రమం, గుండ్లగడ్డ ఉమామహేశ్వరస్వామితో పాటు అన్ని గ్రామాల్లోని ఆలయాలను కాషాయపు జెండాలు, తోరణాలతో అలంకరిస్తున్నారు. పాలకుర్తి మండలం వల్మిడి శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చిల్పూరు మండలం నష్కల్ రామాలయంలో ప్రత్యేక పూజలతో పాటు స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. జఫర్‌గఢ్‌లో శ్రీ సీతారామ చంద్ర లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతకు ముందు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగాలఘనపురం సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఉత్సవాలను నిర్వహించనున్నారు. జనగామ మూలబావి హనుమత్ రామనాథ సహిత శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఉదయం 7 గంటలకు స్వామి వారికి ఆరాధనలు, 9 గంటలకు భక్తబృందం ఆధ్వర్యంలో శ్రీరామ నామ సంకీర్తన, రామరక్ష, ఆపద్ధారక స్తోత్ర, విష్ణు సహస్ర, చాలీసా పారాయణం, భజనలు, కీర్తనలు, 10.30 గంటలకు ఏకల్ అభియాన్ హనుమకొండ వారిచే కోలాటాలు, 11.30 గంటలకు ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం నిర్వహించనున్నారు. జనగామ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం 7 గంటలకు స్వామి వారికి విశేష పంచామృతాభిషేకం, 9 గంటలకు సహస్ర నామాలతో సహస్ర పుష్పార్చన, 11 గంటలకు సామూహిక భజనలు, ప్రత్యక్ష ప్రసారం, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు.



ముస్తాబైన పాలకుర్తి వల్మిడిలోని సీతారామచంద్రస్వామి ఆలయం



లింగాలఘనపురం: జీడికల్‌లోని ఆలయం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలి

బచ్చన్నపేట: అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని దేవాలయాల్లో నేడు (సోమవారం) ప్రత్యేక పూజలు నిర్వహించాలని విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రాజయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆలయాలను అందంగా తీర్చిదిద్దారని, హోమాలు, యజ్ఞాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కొల్ల సర్సిరెడ్డి, చక్రపాణి, చంద్రమౌళి, నగేష్ పాల్గొన్నారు.

నేడు అఖండ రామరక్ష స్తోత్ర పారాయణం

స్టేషన్‌ఘన్‌పూర్: అయోధ్యలో సీతారామచంద్రస్వామి వారి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని తాటికొండ సీతారామచంద్రస్వామి దేవాలయంలో నేడు అఖండ రామరక్ష స్తోత్ర పారాయణం పూజలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి, ఆలయ అర్చకుడు జీడికంటి వరుణాచార్యులు తెలిపారు. తాటికొండ రామాయంలో ఆదివారం సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆలయసంరక్షణ కార్యక్రమాలను చేపట్టారు.



జనగామలో కాషాయపు జెండాలతో భక్తులు



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న హేమంత్‌రాజ్

పండుగలా జరుపుకోవాలి..

వందల సంవత్సరాల కల అయిన అయోధ్యలో రామమందిర నిర్మాణం సాకారం అయిన శుభసందర్భంగా సోమవారం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో ప్రజలు ఉత్సవాలను పండుగలా జరుపుకోవాలని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు బాధ్యులు అంబటి హేమంత్‌రాజ్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రమేష్, చిన్నశ్రీనివాస్, సదానందచారి, రామబ్రహ్మాచారి, నాగరాజు పాల్గొన్నారు.

శివునిపల్లిలో శోభాయాత్ర

అయోధ్యలో శ్రీబాలరామచంద్రస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శివునిపల్లిలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ట్రస్టు బాధ్యుడు వీటీ శ్రీనివాస్ తెలిపారు.

కొత్తపల్లిలో అన్నదానం

అయోధ్యలో శ్రీరామవిగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కొత్తపల్లి అభయాంజనేయస్వామి దేవాలయంలో మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.



జనగామ గుండ్లగడ్డ ఆలయంలో పూజలో పాల్గొన్న మహిళలు



బచ్చన్నపేట: ముస్తాబైన హనుమాన్ ఆలయం

ఇంటింటా అయోధ్యుడి నామస్మరణ చాటాలి

దేవరుప్పుల: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ పురస్కరించకొని పాలకుర్తి నియోజకవర్గంలోని హిందూ ధార్మిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా అయోధ్యుడి నామస్మరణాన్ని చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యకవర్గసభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు.

ముస్తాబైన హనుమాన్ ఆలయం

అయోధ్య రామ జన్మభూమిలో జరగబోయే బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకొని పెద్దమడూరులోని హనుమాన్ ఆలయం ఆదివారం రాత్రి విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ మాట్లాడుతూ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు పెద్దమడూరులో తలపెట్టిన శోభాయాత్రలో ప్రతి ఒక్క హిందు బాంధవ్యులు హాజరు కావాలని కోరారు.

దుర్గామాతకు పూజలు



దుర్గామాతకు పూజలు చేస్తున్న కొమ్మూరి

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో దుర్గామాతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారి వద్ద బైండ్లవారు కథా పురాణాలు చెప్పి ఉదయం అమ్మవారికి జంతు బలి ఇచ్చారు. అనంతరం అందరూ వ్యవసాయ బావుల వద్ద వనభోజనాలకు వెళ్లారు. అమ్మవారి వద్ద మొక్కులు చెల్లించిన అనంతరం బోనాలు తీసుకెళ్లి బావుల వద్ద పెట్టారు. దుర్గామాతకు పూజలు చేసిన వారిలో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ వేముల వెంకట్, ఉప సర్పంచ్ వంచ వెంకట్‌రెడ్డి, నాయకులు నలగోని బాలకిషన్‌గౌడ్, దిడ్డిగ రమేష్, మేకల రాజు, అల్వాల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

12వ వార్డు కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



జనగామ రూరల్: డీసీసీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశల మేరకు ఆదివారం పట్టణంలోని 12వ వార్డు కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. వీవర్స్ కాలనీలోని కాంగ్రెస్ నాయకులు శ్రీరాం శ్రీనివాస్, కోడెం శ్రీనివాస్, బొంతపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వంగ యుగేందర్, ఉపాధ్యక్షులుగా బోడ రమేష్, రచ్చ సత్యనారాయణ, మంగళంపల్లి ఎల్లేష్, ప్రధాన కార్యదర్శిగా బొంతపల్లి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా పల్ల శ్రీనివాస్, కొండం నర్సింహులు, గుర్రం సునీల్, కోశాధికారిగా కాముని సమ్మయ్య ఎన్నికయ్యారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. తమకు పాఠాలు చెప్పిన గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు రూ.30 వేల విలువైన స్పోర్ట్స్ యూనిఫాంలు అందజేశారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, నాటి ఉపాధ్యాయులు దేవేందర్, సుధాకర్‌రావు, ఉపాధ్యాయులు రాజేందర్, యాదగిరి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎల్లాచారి, దాత రాజిరెడ్డి, పూర్వ విద్యార్థులు అజయ్, కృష్ణ, ధనుంజయ్, శైలజరెడ్డి పాల్గొన్నారు.

‘తెలియని లింక్‌లు ఓపెన్ చేయొద్దు’

స్టేషన్‌ఘన్‌పూర్: గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సోషల్‌మీడియాలో వచ్చే లింక్‌లను, వెబ్‌సైట్లను ఎవ్వరూ ఓపెన్ చేసి మోసపోవద్దని ఘన్‌పూర్ సీఐ సట్ల రాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీ అంబర్ కిషోర్‌ఝా ఆదేశాలు, డీసీపీ సీతారాం సూచనల మేరకు ప్రజలకు సమాచారం అందిస్తున్నామన్నారు. సోమవారం అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా చాలా మంది గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో పలు లింక్‌లు పంపి మన ఖాతాలో ఉన్న డబ్బులు కాజేయాలని చూస్తున్నారని చెప్పారని తెలిపారు. ఎవరు కూడా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. రామమందిర ప్రారంభోత్సవం అన్ని ప్రముఖ ఛానెల్స్, యూట్యూబ్ లైవ్ ప్రసారం చేస్తున్నందున అందులో వీక్షించాలని, అనవసరంగా లింక్‌లు ఓపెన్ చేసి వ్యక్తిగత వివరాలు, డబ్బులు పోగొట్టుకోవద్దని కోరారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

లింగాలఘణపురం: తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ప్రిన్సిపాల్ పుష్పకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చే నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జనరల్ విద్యార్థులకు రూ.200, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రూ.125 ఫీజు ఉంటుందని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించబడుతుందన్నారు. 6వ తరగతి వారికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7, 8, 9, 10 తరగతులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని వివరించారు.

నేడు మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్

జఫర్‌గఢ్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ఈ నెల 22న (సోమవారం) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు మండల గణిత ఫోరం కన్వీనర్ పెనుమాటి వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ చాడ గణేష్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి తెలుగు మీడియం నుంచి ఇద్దరు, ఇంగ్లిష్ మీడియం నుంచి ఇద్దరు విద్యార్థుల చొప్పున టాలెంట్ పరీక్షకు హాజరు కావాలని అన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన జిల్లా స్థాయిలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందని అన్నారు. దీంతో పాటు విద్యాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. పరీక్ష నిర్వహణలో అన్ని పాఠశాలలకు చెందిన గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు.

లెనిన్ వారసత్వంతోనే ప్రజాస్వామిక పాలన

దేవరుప్పుల: రష్యా విప్లవ నిర్మాత వీఐ లెనిన్ విప్లవ వారసత్వం పుణికిపుచ్చుకుంటేనే తాడిత, పీడిత ప్రజలకు ప్రజాస్వామిక పాలన లభిస్తుందని మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (రెడ్ ఫ్లాగ్) రాష్ట్ర నేత దొంతి రాజేష్ కన్నా అన్నారు. ఆదివారం మండలంలోని కామారెడ్డిగూడెం స్టేజి వద్ద ఉన్న షేక్ బందగి స్మారక స్థూపం వద్ద లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం ఎంఎల్‌పీఐ(రెడ్ ఫ్లాగ్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10,11 తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవన్‌లో నిర్వహించనున్న మూడో రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాల కమ్యూనిస్టు శ్రేణులకు మార్గదర్శి, ఆదర్శప్రాయుడైన విప్లవయోధుడు లెనిన్ ద్వారానే యునైటెడ్ సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్ ఆఫ్ రష్యా స్థాపించబడిందన్నారు. ప్రస్తుతం భారత దేశంలో బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, మతోన్మాద నిరంకుశపాలనకు చరమగీతం పాడాలన్నా భావితరాలకు స్ఫూర్తిదాయుడైన లెనిన్ పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజాస్వామిక హక్కుల సాధన కోసం ఐక్యసంఘటనకు కార్యారూపం దాల్చే రెడ్‌ఫ్లాగ్ సభలకు వామపక్షభావజాల శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ సభ్యులు మాన్యపు బుజేందర్, ఎండీ కాశీం, జిల్లా నాయకులు తూర్పాటి సారయ్య, ఎండీ పాషా, ఎండీ మున్నా పాల్గొన్నారు.



బందగీ స్థూపం వద్ద లెనిన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

నేడు వల్మిడి ఆలయంలో ప్రత్యేక పూజలు

దేవరుప్పుల: రామజన్మభూమి అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా పాలకుర్తి మండలం వల్మిడి ఆలయంలో మాజీ మంత్రి దయాకర్‌రావు, ఉష దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వృథాగా ‘భగీరథ’ నీరు

చిల్పూరు: చిన్నపెండ్యాల సమీపంలోని ఎల్‌పీ రిసార్ట్ పక్కన భగీరథ పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో ఆనీరు రిసార్ట్‌లోకి చేరి కుంటలా మారిందని రిసార్ట్ మేనేజర్ అబ్రహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నష్కల్ గ్రామానికి తాగునీరు వెళ్తుందన్నారు. ఇటీవల రైతులు పైపులైన్ పగులగొట్టడంతో నీరు పొలాల్లోకి వెళ్లి అక్కడి నుంచి రిసార్ట్‌లోకి చేరడంతో ప్రమారీ కూలిపోయే విధంగా ఉండడంతో పాటు రిసార్ట్‌కు వచ్చిన పిల్లలు ఆడుకునే స్థలంలో కుంటలా మారిందన్నారు. అధికారులు స్పందించి ఇంకోసారి ఇలా జరగకుండా చూడాలని కోరారు.

ఓటరు నమోదు పరిశీలన



రఘునాథపల్లి: ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ యుగేందర్

రఘునాథపల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాలను తహసీల్దార్ పురం యుగేందర్ సందర్శించారు. ఆదివారం ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, నిడిగొండ, మాధారం, ఖిలాషాపూర్, కోమళ్లలో ఓటరు నమోదు ప్రక్రియను తహసీల్దార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఓటు హక్కు వజ్రాయుధం

బచ్చన్నపేట: ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని తహసీల్దార్ విశాలాక్షి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. ఆయా గ్రామాల బీఎల్‌ఓలు అర్హులను గుర్తించి ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, ఓటర్లు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



చిల్పూరు: లింగంపల్లిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమ్మక్క-సారలమ్మ జాతర కోసం ఈనెల 25న వేలం పాటలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం జాతర ఇన్‌చార్జ్ ఈఓ చిందం వంశీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతర ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతర కోసం బంగారం (బెల్లం), పుట్టు వెంట్రుకలు పోగుచేసుకోవడం, కొబ్బరి కాయలు, కోళ్లు, కొబ్బరికాయల చిట్టీలు, సైకిల్, బైక్ స్టాండ్, పుట్నాలు, పేలాలు, దేవీ ప్రసాదం, మద్యం అమ్ముకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు వేలంలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుచుకోవాలన్నారు. 25న వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 99893 54509లో సంప్రదించాలన్నారు. దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి

జఫర్‌గఢ్: హనుమాన్‌తండా రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండలంలోని తీగారం శివారు హనుమాన్‌తండాలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను రాథోడ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హనుమాన్‌తండాకు వెళ్లేందుకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు పనుల విషయంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాలోత్ గణేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

చిల్పూరు: మండలంలోని లింగంపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సమ్మక్క-సారలమ్మ జాతర మాజీ చైర్మన్ మోతె శ్రీనివాస్ ఆస్తికి నష్టం కలిగించిన వారిని గుర్తించి చర్య తీసుకోవాలని పార్టీ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్, మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి పోలీసులను కోరారు. ఆదివారం వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. శనివారం రాత్రి శ్రీనివాస్ వ్యవసాయ బావి వద్ద వరిగడ్డిని గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేయడంతో పాటు అక్కడే ఉన్న ట్రాక్టర్ ఇంజన్‌లోని ఆయిల్ పారబోశారని తెలిపారు. దీంతో అతనికి రూ. 2లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నాయకులు కండ్లకోలు బాలరాజు, కంకటి నరేందర్, తుత్తరు రాజు, పురుమాని రాజు, మంద సిద్ధు, కందుకూరి రాజు తదితరులు ఉన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.